క్లుప్తంగా

జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా సాయిలు



బాన్సువాడ : మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా పసుపుల పెద్ద సాయిలును నియమిస్తూ సోమవారం జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి నియమాక పత్రం అందజేశారు. గతంలో సంఘం జిల్లా అధ్యక్షులుగా ఉన్న గాదం సత్యనారాయణ లింగంపేట్ మండలం మోతే గ్రామంలో సభ్యత్వం చూపించి జిల్లా అధ్యక్ష పదవికి పోటీ చేసి గెలుపొందారు. అయితే ఇటీవల కాలంలో కొందరు సత్యనారాయణకు మోతే గ్రామంలో సభ్యత్వం లేదని ఫిర్యాదు చేయడంతో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేశారు. దీంతో ఉపాధ్యక్షుడిగా ఉన్న పసుపుల పెద్ద సాయిలును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ అన్నారు. ఆయన సోమవారం తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. తాజాగా ఉండే కూరగాయలతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపల్ సురేఖ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

రాకపోకల పునరుద్ధరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లింగంపేట మండలం నాగారం కాసుల కత్త వంతెన, మెంగారం ఊర చెరువు కింద లోలెవెల్ వంతెనలు ధ్వంసమయ్యాయి. దాంతో వారం రోజులుగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు రెండు రోజులుగా పునరుద్ధరణ పనులు చేపట్టారు. సోమవారం ధ్వంసమైన వంతెనల వద్ద తాత్కాలికంగా మొరం వేసి రాకపోకలు పునరుద్ధరించారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ



ఎల్లారెడ్డిరూరల్: వెల్లుట్ల గ్రామంలో సోమవారం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని జలజీవన్ ఉమెన్ ఎంపోర్మెంట్ సంస్థ కో-ఆర్డినేటర్ రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచితంగా కుట్లు, అల్లికలు నేర్పిస్తామన్నారు. దీని ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు.

నేడు మద్నూర్‌కు బాలాజీ జెండా రాక

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో మంగళవారం రాత్రి తిరుమల తిరుపతి శ్రీ బాలాజీ జెండా కొలువుదీరనుంది. ప్రతి సంవత్సరం గణేష్ నిమజ్జన అనంతరం తిరుమల జెండా వస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వరుడి జెండా మద్నూర్‌లో 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకుంటుందని బాలాజీ జెండా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. జెండా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

క్రీడా దుస్తుల వితరణ



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు సోమవారం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన వై. సత్యనారాయణ క్రీడా దుస్తులను ఉచితంగా అందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. సుమారు రూ.10 వేల విలువ చేసే క్రీడాదుస్తులు అందించిన సత్యనారాయణను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెరుగు రాణి అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ సురేందర్, ఉపాధ్యాయులు సాంబయ్య, వేదప్రకాష్, సలామ్, మసూద్, హరీశ, సుజాత పాల్గొన్నారు.

మంచి నీటి గోస

- 45 రోజులుగా అందని మిషన్ భగీరథ నీరు
- బోరుబావులే గ్రామస్తులకు దిక్కు
- కరెంట్ ఉంటేనే నీరు
- మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు



మంచి నీటి కోసం నిరసన తెలుపుతున్న కాటేపల్లి గ్రామస్తులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాటేపల్లి, కాటేపల్లి తండాలకు, పిట్లం మండలంలోని బున్నాపూర్, అల్లాపూర్, పారడ్‌పల్లి, కోరన్‌పల్లి గ్రామాలకు 45 రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల రాక ఆ గ్రామాల ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. కాటేపల్లిలో పంచాయతీ బోరు మోటార్లు కాలిపోవడం, మిషన్ భగీరథ నీళ్ల రాకపోవడంతో మంచినీటి కోసం మహిళలు గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కాటేపల్లి రోడ్డుపై ఖాళీ బిందెలతో మహిళలు నిరసనకు దిగారు. మంచి నీళ్ల రాక బోరుబావుల వద్ద నుంచి ఆటోలలో నీళ్లు తెచ్చుకునే పరిస్థితి నెలకొందని మహిళలు పేర్కొన్నారు. బోయవాడలో బోరు ఉండగా అది కాలిపోయి 45 రోజులు గడుస్తున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. వెంటనే స్పందించి మిషన్ భగీరథ నీళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం

మంచి నీటి కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. ఉన్న బోరు పాడైపోయింది. పంచాయతీ కార్యదర్శి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. పంట పొలాల వద్ద ఉన్న బోరు బావుల నుంచి ఆటోలో మంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

– అంజవ్వ, కాటేపల్లి గ్రామవాసి

త్వరగా మరమ్మతులు చేయిస్తాం...

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అవ్వడంతో ఆరు గ్రామాలకు నీరు అందడంలేదు. తరచుగా వర్షాలు పడడంతో మరమ్మతులు చేయించలేకపోయాం. రెండు రోజుల్లో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించి ఆరు గ్రామాలకు నీరు అందిచేలా చర్యలు తీసుకుంటాం.

– కౌశిక్, మిషన్ భగీరథ డీఈ

నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లను రద్దు చేయాలి



సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గిరిజన నేతలు

బాన్సువాడ రూరల్: కామారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల్లో బీసీలు కొందరు నాయక్‌పోడ్ అని చెబుతూ నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు పొందుతున్నారని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌నాయక్ ఆరోపించారు. సోమవారం ఆయన బాన్సువాడలో గిరిజన నాయకులతో కలిసి సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయిని కలిసి సమస్యను వివరించారు. నాయక్‌పోడ్ పేరిట నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు పొందిన బీసీలను గుర్తించాలన్నారు. ఎస్టీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియను సంక్లిష్టంగా పరిశీలించాలన్నారు. మహ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల్లో ఇప్పటికే జారీ చేసిన నకిలీ సర్టిఫికెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేశారు. ఏఐబీఎస్ఎస్ బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు బన్సీలాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌సింగ్, గౌరవ అధ్యక్షుడు జాగూర్, భాస్కర్, బలరాం, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సరిదిద్దని సమావేశాలు ఎందుకు?



భిక్కనూరులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అఖిలపక్ష నేతలు

భిక్కనూరు: ఓటర్ల జాబితా విషయమై సమావేశం నిర్వహిస్తున్న అధికారులు.. జాబితాలో ఉన్న తప్పులు సరిదిద్దని సమావేశాలు ఎందుకు అని అఖిల పక్షం నేతలు సోమవారం ప్రశ్నించారు. భిక్కనూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విషయమై అన్ని పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అన్ని పార్టీల నేతలు ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయని.. ఒక గ్రామానికి చెందిన వ్యక్తుల ఓట్లు వేరే గ్రామం జాబితాలో ఉన్నాయని, చనిపోయిన వారి పేర్లు జాబితాలో కనిపిస్తున్నాయని వాటిని సరిచేయాలని అధికారులను కోరారు. ఇది తమ పరిధిలో లేదని అధికారులు తెలపడంతో అలాంటప్పుడు ఎందుకు తమను ఆహ్వానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ సునీతకు ఓటర్ల జాబితాను సరిదిద్దాలని వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయరూ..!



తిమ్మారెడ్డి శివారులో కోతకు గురైన రోడ్డు



మట్టి పోసినా ఏర్పడిన మోకాలు లోతు గుంతలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలో భారీ వర్షాల కారణంగా కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని తిమ్మారెడ్డి- ఆజామాబాద్ గ్రామాల మధ్యలో రోడ్డు కోతకు గురైంది. తిమ్మారెడ్డి శివారులో చీమల వాగు పొంగిపొర్లడంతో ఆజామాబాద్- తిమ్మారెడ్డి గ్రామాలకు మూడు రోజుల పాటు రాకపోకలు నిలిచి పోయాయి. అధికారులు తాత్కాలికంగా మట్టిని పోసినప్పటికి మట్టి మోకాళ్లలోతు దిగబడి పోవడంతో ద్విచక్ర వాహనదారులు సైతం దాని నుంచి పోవడానికి ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో పాటు పక్కనే రోడ్డు పూర్తిగా కోతకు గురి కావడంతో ఆటోలు, కార్లు వెళ్లలేని పరిస్థితి ఉందని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గులాబీ జెండా ఎగరవేయాలి



బీర్కూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

బాన్సువాడ : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేయాలని బీఆర్ఎస్ నాయకులు జుబేర్ అన్నారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ప్రతి గ్రామంలో ప్రచార అస్త్రాలుగా మార్చుకోవాలని సూచించారు. ఆరు గ్యారంటీల విషయం ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రస్తుతం రిజర్వేషన్ల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, యలమంచిలి శ్రీనివాస్‌రావు, నార్ల రత్నకుమార్, విఠల్ తదితరులు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపు హర్షణీయం



జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



లింగంపేట అంబేద్కర్ చౌరస్తాలో..

సాక్షి నెట్‌వర్క్:కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీని తగ్గిస్తూ చర్యలు తీసుకోవడం హర్షణీయమని జిల్లా బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలపై 18, 12 శాతం వరకు ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించడంతో సాధారణ ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చేశారని అన్నారు. ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ ఎత్తివేయడం ద్వారా చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని, దీని వల్ల సామాన్యులకు కూడా బీమా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు.



తాడ్వాయిలో..



ఎల్లారెడ్డిలో..

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి



వినతి పత్రం ఇస్తున్న బీకేఎస్ నేతలు

గాంధారి(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు నష్టపోయిన బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో వినతి పత్రాలు ఇచ్చారు. తహసీల్ కార్యాలయంలో డీటీ లక్ష్మణ్‌కు, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఈవో నిఖితకు వినతి పత్రాలు ఇచ్చారు. అలాగే సోయా పంట కోతకు వచ్చేసిందని అక్టోబర్ మొదటి వారంలోనే సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభిస్తున్నారని, దీనివల్ల దళారులు, ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు రావుసాహెబ్ రావు, మాధవరావు, భూపతి, రాజేందర్, గంగాకిషన్, రమేష్‌రావు, బాలవీరయ్య, కమలాకర్, మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మరిన్ని అవార్డులను అందుకోవాలి

ఎల్లారెడ్డి: ఉపాధ్యాయులు జీవితంలో మరిన్ని అవార్డులను అందుకోవాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను సైతం ఉపాధ్యాయ ఉద్యోగాన్ని ఒక్క మార్కు తేడాతో కోల్పోయానని అన్నారు. అనంతరం రెవెన్యూ విభాగంలో ఉద్యోగం సాధించానని తెలిపారు. అనంతరం మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. ఎంఈవో రాజులు, ఉపాధ్యాయులున్నారు.

మానవాళికి శాంతిదూత మహమ్మద్ ప్రవక్త



బాన్సువాడలో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

బాన్సువాడ: మమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని సోమవారం బాన్సువాడ పట్టణంలోని మస్జిద్ నూర్ నుంచి నేక్ బీ దర్గా వరకు ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షాదీఖాన చైర్మన్ అబ్దుల్ వాహబ్ మాట్లాడుతూ.. మానవాళికి శాంతి దూత, శాంతి సందేశం ఇచ్చిన మమ్మద్ ప్రవక్త అని కొనియాడారు. ప్రవక్త సూచించిన మార్గాన్ని ముస్లింలు అనుసరించాలని అన్నారు. ప్రవక్త ఇచ్చిన సందేశం గొప్పతనం గురించి వివరించారు. మాజీ ఎంపీపీ ఎజాస్, నూర్ అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్, మహ్మద్ హుస్సేన్, హకీం, గౌస్ తదితరులున్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లింలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జామి మజీద్ నుంచి బస్టాండ్ సమీపంలోని ఖాదర్య మజీద్ వరకు ప్రధాన వీధుల గుండా మమ్మద్ ప్రవక్త బోధనలు, డీజే సౌండ్ సిస్టమ్‌తో ర్యాలీ తీశారు. అనంతరం మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం పెద్దలు ఫారూక్, ఫతియోద్దీన్, మన్సూర్‌ఖాన్, సలీం, వసీం, సిరాజ్, అబ్దుల్ ఖాలేక్, ముస్తఫా, షరీఫ్, అబ్దుల్ షౌకత్, జమీల్, ఆరిఫ్, మీరాజ్, హర్షద్, రాఫెల్, తదితరులు పాల్గొన్నారు.



లింగంపేటలో ..

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి



తాడ్వాయిలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ



లింగంపేటలో.. ఎంపీడీవో నరేష్



నాగిరెడ్డిపేటలో.. ఎంపీడీవో ప్రభాకరచారి

ఎల్లారెడ్డి/తాడ్వాయి/లింగంపేట/నాగిరెడ్డిపేట:ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలని ఎంపీడీవోలు కోరారు. సోమవారం ఎల్లారెడ్డి, తాడ్వాయి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయాల్లో అన్ని పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామాల్లో ఓటరు జాబితాను ప్రదర్శించామని తెలిపారు. ప్రదర్శించిన జాబితాలో తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు.



దోమకొండలో.. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



ఎల్లారెడ్డిలో.. ఎంపీడీవో ప్రకాశ్

ఉపాధ్యాయ వృత్తిని మించినది లేదు



భిక్కనూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జ్ఞానప్రకాశ్ రెడ్డి

భిక్కనూరు: ప్రపంచానికి ఆదర్శపౌరులను అందించే వృత్తి ఉపాధ్యాయ వృత్తి మాత్రమేనని, దీన్ని మించిన వృత్తి మరొకటి లేదని కౌసల్య ఫౌండేషన్ చైర్మన్ పెద్దబచ్చగారి జ్ఞానప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన భిక్కనూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవంలో భాగంగా 16 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా తాత పెద్దబచ్చగారి నారాయణరెడ్డి 1969 వరకు బ్రాంచ్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి నిధులు వెచ్చిస్తున్నానన్నారు. జపాన్‌లో ప్రతి ఒక్కరూ 90 ఏళ్లకు పైగా జీవిస్తున్నారని, వారిలాగే మనం కూడా ఏవిధంగా జీవించవచ్చునో తెలియజేసే ఇకిగావ్ పుస్తకం తెలుగు అనువాదాన్ని ఉపాధ్యాయులకు అందజేస్తున్నానన్నారు. ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, నేతలు దప్పు రవి, శంకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో జిల్లాకు 19 పతకాలు



రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో విజేతలతో కోచ్‌లు, మేనేజర్లు

కామారెడ్డిఅర్బన్: నిర్మల్‌లో ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 6వ యోగాసన పోటీల్లో కామారెడ్డి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చూపి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాస రఘుకుమార్‌లు వివరాలు వెల్లడించారు. మొత్తం 19 పతకాలు సాధించినట్టు పేర్కొన్నారు. సబ్ జూనియర్ విభాగంలో జ్యోత్స్న, సునీత (రిథమిక్ పెయిర్‌లో బంగారు పతకం), బి.నిఖిత (ఆర్టిస్టిక్ సింగిల్ సబ్‌జూనియర్ గరల్స్- రజతం), కవిత(లెగ్ బ్యాలెన్సింగ్‌లో రజతం), సింధూజ (హ్యాండ్ బ్యాలెన్సింగ్‌లో బంగారు పతకం), శిరీష, వైష్ణవి(ఆర్టిస్టిక్ పెయిర్‌లో రజతం), అంజలి(ట్రెడిషనల్‌లో ఐదవ స్థానం) విఘ్నేష్(సబ్‌జూనియర్ బాయ్స్ సుపైన్‌లో కాంస్యం), జూనియర్ విభాగంలో సహస్ర, సరస్వతి, స్రవంతి, శైలిశ్రీ, కృప, హరిణి, నవదీప్‌లు బంగారు, రజత, కాంస్య పతకాలు పొందారన్నారు. విజేతలు జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటడానికి ఇంకా పట్టుదలతో కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెప్పారు.

సంక్షిప్తం

ఇష్టకార్య సిద్ధి శ్రీహన్మాన్ ఆలయ కమిటీ కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: స్థానిక ఆర్‌బీ నగర్ ఇష్టకార్య సిద్ధి శ్రీహన్మాన్ ఆలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా అయిత బాల్‌కిషన్, గౌరవ అధ్యక్షుడిగా బి.సత్యనారాయణగౌడ్ ఉపాధ్యక్షులుగా ఆధారపు నిత్యానందం, వీరమల్లి ప్రభాకర్, కార్యదర్శిగా సిరిగాద దేవాచారి, కోశాధికారిగా ఇల్లెందుల రమేష్, ఉపకార్యదర్శులుగా ముదాం నారాయణ, ఏ.రాజేశ్వర్, కాశెట్టి శ్రీనివాస్, నీల రాజు, కిషన్‌గౌడ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లోకుల సంగారాజు, ఉప ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కాకర్ల శేఖర్, ఆడిటర్‌గా తాటికొండ రాజేశ్వర్, సలహాదారులుగా కుమార్‌గౌడ్, ఉప్పల శ్రీనివాస్, బి.నర్సింహారెడ్డి, కొండ వినోద్, మహిళా ప్రతినిధులుగా నీల సంధ్య, డి.అన్నపూర్ణ, డి.జ్యోతి, ఎస్.జీవిత ఎన్నికయ్యారు.

రోడ్డు మరమ్మతు పనులతో హర్షం

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని పెద్ద టాక్లీ నుంచి సిర్పూర్ వరకు రహదారిపై ఏర్పడిన గుంతలకు సోమవారం మరమ్మతు పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల భారీ వరదల కారణంగా ప్రధాన రహదారి దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాలతో రోడ్డుపై మొరం వేసి పనులు చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రాజంపేట: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సోమవారం ఇన్ఫోసిస్ బెలూర్ వారి సహకారంతో హైదరాబాద్ రామకృష్ణమఠ్ ఆధ్వర్యంలో ఎల్లాపూర్, లేతమామిడి తండాలలోని వరద బాధితులకు నిత్యావసర సరుకులు, వస్తువులు తహసీల్దార్ జానకి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వరద బాధితులు రామకృష్ణమఠ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించిందని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. సోమవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. కార్యదర్శులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు.అలాగే ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ఇళ్ల వివరాలు అందజేయాలని సూచించారు. ఎంపీవో మలహరి, ఆర్ఐ కిరణ్ పాల్గొన్నారు.

హన్మాజీపేట్‌లో..

బాన్సువాడ రూరల్:హన్మాజీపేట్‌లో సోమవారం పారిశుద్ధ్య పనులు చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి రాజేష్ తెలిపారు. కాలనీల్లోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపజేశామన్నారు.గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఆయన కోరారు.దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

రాజంపేట: మండల కేంద్రంలోని స్థానిక సాయిబాబా ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.